ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 4 ఫిబ్రవరి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 18.0



మిషన్ 'మధుమేహ'

- వనపర్తి జిల్లాలో డయాబెటీస్ స్ర్కీనింగ్‌కు వినూత్న కార్యక్రమం
- ఇప్పటికే మొదటి విడత పూర్తి.. రెండో విడత ప్రారంభం
- 30 ఏళ్లు దాటిన 3.09 లక్షల మందికి పరీక్షలు చేయడమే లక్ష్యం
- మొదటి విడతలో 201 మంది కొత్త వ్యాధిగ్రస్తుల నిర్ధారణ
- అన్ని జిల్లాల్లో చేయడం ద్వారా ప్రజారోగ్యం మెరుగవుతుందనే భావన



వనపర్తి జిల్లా అప్పాయిపల్లిలో మిషన్ మధుమేహ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మారిన ఆహారపు అలవాట్లు.. వాతావరణ పరిస్థితులు.. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో అదేస్థాయిలో వ్యాధులు కూడా పెరుగుతున్నాయి. ఆర్థిక స్థితి బాగున్నవారు, వ్యాధి నిర్ధారణ చేసుకోవాలనే అవగాహన ఉన్నవారు వారికివారే ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. కానీ అవగాహన లేనివారు, ఆర్థిక స్థితి బాగోలేని వారు వ్యాధి నిర్ధారణ చేసుకోవడానికే ముందుకు రావడం లేదు. ఈ కారణంగా వారికి తెలియకుండానే శరీరంలో వ్యాధి తీవ్రత పెరిగిపోయి, తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. వ్యాధి నిర్ధారణ



ముందుగా చేసుకోగలిగితే తీవ్ర అనారోగ్యం బారిన పడకుండా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఐ స్ర్కీనింగ్ చేసింది. అప్పుడు చాలామందికి సైట్ ఉన్నది, కాటరాక్ట్ ఇబ్బంది ఉన్నది తెలిసి.. వైద్యుల సూచనలతో అద్దాలు ఇవ్వడంతోపాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్స కూడా చేశారు. ఇప్పుడు వనపర్తి జిల్లాలో మధుమేహ బాధితులను గుర్తించడానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిని మిషన్ మధుమేహ కూడా అని చెప్పవచ్చు. అయితే ఈ బాధితులను గుర్తించడానికి 2021లో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనబుల్ డిసీసెస్) సర్వే పేరుతో కమ్యూనిటీ బేస్డ్ సర్వే నిర్వహించారు. అది అంత కచ్చితత్వంతో జరగలేదని అభిప్రాయం ఉంది. అయితే నాలుగేళ్లు పూర్తికావడంతో కలెక్టర్ ఆదర్శ్ సురభి వనపర్తి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆశలు ఇంటింటికీ వెళ్లి ముందుగా గ్లూకోమీటర్‌తో ఆర్‌బీఎస్(ర్యాండమ్ బ్లడ్ షుగర్) చెక్ చేస్తారు. ఆ తర్వాత 126 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ఆర్‌బీఎస్ సూచిస్తే.. వారివి తిన్నాక, తినకముందు రక్త నమూనాలు తీసుకుని తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్స్‌కు పంపిస్తారు. అందులో డయాబెటీస్ నిర్ధారణ అయితే.. సదరు వ్యక్తులను మెడికల్ ఆఫీసర్ ద్వారా పరీక్షించి, సబ్ సెంటర్ల ద్వారా ప్రతీ నెలా మందులు అందజేస్తారు. లేకపోతే ఈ సంజీవనీ ద్వారా వాట్సప్ కన్సల్టెన్సీ ఇప్పించి

(మిగతా 6 లో..)

నిర్ధారణ చేసుకోవాలి



మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్ల కారణంగా డయాబెటీస్ కేసులు ఎక్కువవుతున్నాయి. కొందరు అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగే వరకు నిర్ధారించుకోవడం లేదు. మేము ఈ స్ర్కీనింగ్ వారి కోసమే ప్రారంభించాం. 30 సంవత్సరాల పైబడిన వారికి ఈ పరీక్షలు చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచిస్తున్నాయి. అందరూ స్వచ్ఛందంగా స్ర్కీనింగ్ చేసుకుని, మెడికేషన్, వైద్యుల సలహాలు తీసుకుంటే ఉపకరంగా ఉంటుంది.

\- ఆదర్శ్ సురభి, కలెక్టర్, వనపర్తి

పల్లి రైతు పరేషాన్



మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన వేరుశనగ

- గిట్టుబాటు ధర అందక ఆందోళన
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.6,783..
- వ్యాపారులు ఇస్తున్నది రూ.6,169
- గత ఏడాది కంటే రూ.2,000 తగ్గిన రేటు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విన్నపం

పాలమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేరుశనగకు గిట్టుబాటు ధర రాక రైతు అల్లాడుతున్నాడు. క్వింటాలుకు ప్రభుత్వం రూ. 6,783 మద్దతు ధర నిర్ణయించగా, కానీ వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారని, ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం అత్యధికంగా రూ.6,169, తక్కువగా రూ.4,005 ధర పలికింది. ఈ ధరకు పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు వాపోతున్నారు. గతేడాది రూ. 8,500 ధర పలికింది.

గతం కంటే పెరిగిన సాగు

జిల్లాలో గత ఏడాది యాసంగిలో 11,034 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. 7,827 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది యాసంగిలో 12,832 ఎకరాల్లో సాగు చేయగా, 8,982 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే గతేడాది క్వింటాల్‌కు అత్యధికంగా రూ.8,500 నుంచి రూ.7,309, అత్యల్పంగా రూ.3,512 ధర పలికింది. మార్కెట్‌లో ఖాళీ స్థలం కనిపించనంతగా పల్లీ రాశులు పోసేవారు. మహబూబ్‌నగర్‌తోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు, సరిహద్దున ఉన్న కర్ణాటక ప్రాంత గ్రామాల రైతులు పాలమూరు మార్కెట్‌కు పల్లీని తెచ్చి విక్రయించారు. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేయడం, గిట్టుబాటు ధర ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్‌కు రోజూ 10 వేల క్వింటాళ్లకు పైగా వేరుశనగ వచ్చేది. గత ఏడాది గిట్టుబాటు ధర రావడంతో ఈ ఏడాది అధికంగా వేరుశనగ సాగు చేశారు. కానీ ధర తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో సోమవారం అధికంగా రూ.6,169 ధర పలుకగా, తక్కువగా రూ.4,005, మధ్య రకంగా రూ.5,199 ధర పలికింది. గతేడాది రూ.8,500 ధర ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర రూ.6,783 కూడా రావడం లేదని అంటున్నారు. ఇలా అయితే పెట్టుబడి కూడా ఎల్లదని వాపోతున్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరుతున్నారు.

వ్యాపారులే తగ్గించారు



ధర పోయినేడు కంటే ఈసారి క్వింటాల్‌కు రూ.రెండు వేలు తక్కువ ఉంది. వ్యాపారులే ధర తగ్గించిండ్రు. ఆరుగాలం కష్టపడిన రైతుకు ఇంత అన్యాయం జరిగితే ఎవరిని అడగాలి. ప్రభుత్వమే కొని, గిట్టుబాటు ధర ఇవ్వాలి.

\- గోపాల్, మహమ్మదాబాద్

ప్రభుత్వమే కొనాలి



రైతుల దగ్గర ప్రభుత్వమే పల్లి కొనాలి. అప్పుడే గిట్టుబాటు అయితది. వ్యాపారులను నమ్ముకుంటే నట్టేట ముంచుతున్నారు. వ్యాపారులందరూ ఒక్కటయ్యి రైతులను నిండా ముంచుతున్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వం చెప్పినట్లు చేస్తామంటున్నరు.

\- రామచంద్రయ్య, చౌదర్‌పల్లి

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

- ఉదయం 93.84, మధ్యాహ్నం 97.04 హాజరు శాతం నమోదు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్స రం, ఒకేషనల్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు సోమవారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 22 కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించ లేదు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో కౌసర్ జహాన్ పరిశీలించారు.

171 మంది విద్యార్థులు గైర్హాజరు



ఓ ప్రైవేటు కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో

ప్రయోగ పరీక్షలకు 3,690 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 3,519 మంది హాజరయ్యారు. 171 మంది గైర్హాజరు అయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 850 మందికి గాను 825 మంది హాజరు కాగా, 25 మంది, ఒకేషనల్ విభాగంలో 1,033 మం దికి గాను 989 మంది హాజరు కాగా 94 మంది గైర్హాజరు అయ్యారు. 93.84 హాజరు శాతం నమోదైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు జనరల్ విభాగంలో 771 మంది విద్యార్థులకు గాను 755 మంది హాజరు కాగా 16 మంది, ఒకేషనల్ విభాగంలో 986 మందికి గాను 950 హాజరు కాగా 36 మంది గైర్హాజరు అయ్యారు. 97.04 హాజరు శాతం నమోదైంది.

కేంద్రం అన్యాయం

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కక్ష
- ఎమ్మెల్యేలు జీఎంఆర్, యెన్నం
- బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. తమ అధికారం కాపాడుకునేందుకు ఆంధ్రకు, బీహార్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే సరిపోతుందా?.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై బడ్జెట్ కేటాయింపులో ఎందుకింత వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బీజేపీ నుంచి ఎంపీగా గెలిచిన డీకే అరుణ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి కానీ, తెలంగాణకు నిధులు కేటాయించే విషయంలో ఒక్క మంత్రిని కూడా కలువలేదని, ఒక్కమాట మాట్లాడటం లేదని విమర్శించారు. ఢిల్లీలో మాట్లాడరు కానీ కొడంగల్ వెళ్లి ప్రచారం చేస్తూ, షో పుటప్ కార్యక్రమాలు చేయడం దురదృష్టకరమన్నారు. బీజేపీ ఎంపీలను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. కేంద్రం దిగొచ్చి రాష్ట్రానికి నిధులు కేటాయించే వరకు కాంగ్రెస్ పోరాడతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా హామీ నిలబెట్టుకోలేదని, శంషాబాద్ నుంచి బెంగళూరు హైవేను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా మారుస్తామని నిధులు ఇవ్వలేదని, మహబూబ్‌నగర్ నుంచి తాండూర్‌కు రైల్వే లైన్ కావాలని పదేళ్లుగా అడుగుతున్నా బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదని చెప్పారు. వారం రోజులు నిరసన కార్యక్రమాలు చేయాలని, ఈ నిరసనలు ఢిల్లీకి తాకేలా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ నాయకులు వినోద్‌కుమార్, ఆనంద్‌కుమార్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, వసంత, జహీర్‌అక్తర్, సిరాజ్‌ఖాద్రి, అవేజ్, సాయిబాబ, చంద్రకుమార్‌గౌడ్, బెక్కరి అనిత, పెద్ద విజయ్‌కుమార్, రాఘవేందర్‌రాజు, రాములు యాదవ్, అవేజ్, షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ సిద్ధం

- రాష్ట్రంలోనే తొలిసారిగా నారాయణపేటలో ఏర్పాటు
- నిర్వహించనున్న మహిళలు
- త్వరలో ప్రారంభం



సిద్ధమౌతున్న పెట్రోల్ బంక్

నారాయణపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నారాయణపేటలో పెట్రోల్ బంక్ ప్రారంభానికి సిద్ధమైంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద పలు యూనిట్లను నెలకొల్పుతున్నారు. ఆ క్రమంలోనే నారాయణపేట జిల్లాలో రాష్ట్రంలోనే తొలిసారి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. మహిళా సమాఖ్య సభ్యులు దీనిని నిర్వహించనున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం సింగారం చౌరస్తాలో 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చి, పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. భారత్ పెట్రోలియం యజమాన్యం పెట్రోల్ బంక్‌కు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. గత సెప్టెంబరులోనే జిల్లా మహిళా సమాఖ్యకు 20 సంవత్సరాల పాటు నిర్వాహణ ఒప్పందం కుదిరింది. నిర్మాణపు పనులు భారత్ పెట్రోల్ బంక్ చేపట్టింది. త్వరలో ప్రారంభించనున్నారు. డీజిల్, పెట్రోల్ కొనుగోలు, బంక్ నిర్వహణ జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు చూసుకోనున్నారు. దాదాపు పది మంది వరకు రోజూ ఉపాది లభించనుంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 11 మండల మహిళా సమాఖ్యలు, 353 గ్రామైఖ్య సంఘాలు ఉన్నాయి.

భక్త జనసంద్రం

- ఘనంగా జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు

6

ఐదుగురు ఎస్సైల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

6

అనన్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



న్యూరిషి పాఠశాలలో స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో దేశంలోనే మూడో ర్యాంక్ సాధించిన పాలమూరుకు చెందిన అనన్యరెడ్డిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముం దుకు సాగాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, చదువుతో సరితుగే ఆస్తులు ఏమీ లేవని చెప్పారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాల, అక్షర, శ్రీ ప్రతిభ, ప్రజ్ఞా, పద్మాలయ, గీతం పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. గత ఏడాది డిజిటల్ కంటెంట్‌ను విద్యార్థులు వినియోగించుకోవడం వల్ల మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో పదో తరగతిలో ఉత్తీర్ణత 23 శాతం పెరిగిందన్నారు. ఈ సారి కూడా ఈ డిజిటల్ కంటెంట్‌ను ఉపయోగించుకొని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలన్నారు. కార్యక్రమంలో న్యూరిషి పాఠశాల సలహాదారు వెంకటయ్య, డైరక్టర్ పూజిత, ప్రజ్ఞా పాఠశాల కరస్పాండెంట్ చల్మారెడ్డి, అక్షర పాఠశాల డైరక్టర్ మొగులప్ప, ఆయా పాఠశాల కరస్పాండెంట్లు వంశీమోహన్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటరమణ, కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, రాఘవేందర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ కలవరం

- మహబూబ్‌నగర్ జిల్లాలో అధికారికంగా 1,406 మంది బాధితులు

7

వైభవంగా బండారు మహోత్సవం

- ఊట్కూర్ బీరలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

7

బాధిత కుటుంబానికి

రూ.10 లక్షల ఆర్థిక సహాయం



జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉదండాపూర్ గ్రామస్థులు

జడ్చర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టులో నీళ్ల నిలిచిన గుంతలో పడి మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకు సోమవారం ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న కంపెనీల ప్రతినిధులు రూ.10లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఉదండాపూర్ గ్రామానికి చెందిన ఆరెల్ల మల్లయ్య, పార్వతమ్మల కుమార్తె భాగ్యలక్ష్మి, కుమారుడు మహేష్‌లు ఈ నెల 1వ తేదీన నీళ్ల నిలిచిన గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న కంపెనీల ప్రతినిధులు రూ.10 లక్షల సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు మొదటగా రూ.50 వేల నగదును అందచేసిన కంపెనీల ప్రతినిధులు, సోమవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో రూ.9లక్షల 50వేల చెక్కును ఆరెల్ల మల్లయ్య, పార్వతమ్మలకు కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందచేశారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేలా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చర్యలు తీసుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉదండాపూర్ గ్రామస్థులు బుక్క వెంకటేశ్, రామాంజనేయులు, అశోక్‌గౌడ్, హన్మంతుతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్సైల బదిలీ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో పని చేస్తున్న ఐదుగురు ఎస్సైలకు బదిలీ అయింది. ఈ మేరకు సోమవారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. గద్వాల డీసీఆర్‌బీ ఎస్సైగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావును అయిజ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేయగా, అయిజ ఎస్సైగా పనిచేస్తున్న విజయభాస్కర్‌ను వనపర్తి వీఆర్‌గా, బాలానగర్ ఎస్సై కె.తిరుపాజిని వీఆర్ మహబూబ్‌నగర్‌కు, మహబూబ్‌నగర్‌లో వీఆర్‌లో ఉన్న ఎ. పర్వతాలును వీఆర్ నాగర్‌కర్నూల్‌కు, నాగర్‌కర్నూల్‌లో వీఆర్‌లో ఉన్న డి.లెనిన్‌ను బాలానగర్ ఎస్సైగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

● ముగ్గురు ఏఎస్సైలకు పదోన్నతి

ముగ్గురు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. వెంటనే వారికి పోస్టింగ్‌లు కేటాయించారు. నాగర్‌కర్నూల్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న లయక్‌అలీ, మహబూబ్‌నగర్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న అజం అలీ, నారాయణపేటలో ఏఎస్సైగా పని చేస్తున్న భువనయ్యలకు పదోన్నతులు లభించగా వీరిలో లయక్‌అలీని గద్వాలకు, అజంఅలీని నాగర్‌కర్నూల్‌కు, భువనయ్యను నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేశారు.

భక్త జనసంద్రం

● కలశాలతో పోటెత్తిన మహిళలు ● పోతురాజుల ఆటలు.. పోలేరమ్మ పాటలు..

● డప్పుచప్పుళ్లతో మారుమోగిన హేమలాపురం

అలంపూరుచౌరస్తా/అలంపూరు ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏడాదికొక్కసారి నిజరూప దర్శనమిచ్చే అమ్మవారిని తిలకించి అశేష జనవాహిని పులకించిపోయింది. సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు వేలాదిమంది భక్తులు కలశాలతో, బోనాలతో అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణతో ముగిశాయి. అయిదు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు చివరి రోజు అట్టహాసంగా జరిగాయి. అమ్మవారి నిజరూప దర్శనం చేసుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుమారు 20వేల మందికిపైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఉదయం నుంచే అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 9గంటలకు అమ్మవారి యాగశాలలో నిత్యహోమాలు నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి చేపట్టారు. ఆ తర్వాత అమ్మవారికి సహస్రఘటాభిషేకం ప్రారంభించారు. అప్పటికే వేచి ఉన్న భక్తులు కలశాలతో అమ్మవారి గర్భాలయం వరకు వచ్చి కలశాలలో మోసుకొచ్చిన పవిత్ర జలాలతో, పంచామృతాలతో, గోక్షీరాలతో నిజరూపంలో ఉన్న అమ్మవారిని అభిషేకం చేశారు.

డప్పుచప్పుళ్లతో ..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి సేవా సమితి వారు ప్రతీ ఏటా నిర్వహిస్తూ వస్తున్న ఈ ఉత్సవాలు ఉదయం నుంచే ప్రారంభమయ్యాయి. వసంత పంచమి రోజున జోగుళాంబ సేవాసమితి అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మలు, హరిశ్చంద్ర ఘాట్‌లో వెలసిన అష్టభుజి జోగుళాంబ గంటలేశ్వర ఆలయం నుంచి జాతరను ప్రారంభించారు. గ్రామ దేవతల వేషధారణలతో అలంపూర్ పట్టణమంతా అమ్మవారి జాతరను తలపించింది. డప్పుచప్పుళ్లతో హేమలాపురం మారుమోగింది. ఏపీలోని ఏలూరు, హైదరాబాదు నగరాల నుంచి సేవాసమితి వారు ప్రత్యేకంగా కళాకారులను ఆదివారమే రప్పించారు. 40మంది కళాకారులు జోగుళాంబ, సుంకులమ్మ, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, పార్వతీదేవి, పోలేరమ్మ దేవతల వేషధారణలతో న్యూప్లాట్స్ నుంచి బోనాలతో, కలశాలతో సిద్ధమైన భక్తులను స్వాగతిస్తూ పురవీధుల గుండా డప్పుచప్పుళ్లకు నృత్యాలు చేస్తూ పట్టణంలో అన్ని వీధులలోని భక్తులను వెంటబెట్టుకుని ఆలయానికి బయలుదేరారు. దీంతో పట్టణంలోని వీధులన్నీ జనసంద్రాన్ని తలపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పోలేరమ్మ పాటలకు పోతురాజులు వేసిన ఆటలను తిలకించేందుకు బారులు తీరారు. వచ్చిన యువత వారితో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

మహా పూర్ణాహుతితో పరిసమాప్తి

అమ్మవారి యాగశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న చండీహోమాలు, అవాహిత దేవతా హోమాలకు చివరి రోజు మహా పూర్ణాహుతి సమర్పించి, బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. అలాగే యాగరక్షను అమ్మవారి మూలవిరాట్‌కు సమర్పించిన అనంతరం భక్తులకు అందజేశారు. యాగశాలలోని కలశాలను ఉద్వాసన చేసి, వాటిని ఊరేగింపుగా గర్భాలయానికి తీసుకెళ్లారు. ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దశవిధ హారతులు సమర్పించారు.

ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులకు ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి నిజరూప దర్శనం

వసంత పంచమిని పురస్కరించుకుని ఆలయంలో నిజరూపంలో ఉన్న అమ్మవారికి అభిషేకం చేసేందుకు భక్తులు ఉపవాసదీక్షతో కలశాలలో పవిత్ర జలాలను మోసుకొచ్చి సమర్పించారు. కలశాలతో వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. అమ్మవారి కుంకుమార్చన మండపంలో సర్వతో భద్రమండలిపై స్థాపించిన 1008 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు.

సప్తనదీ జలాలను ఆయా కలశాలలో వేసి, వేదమంత్రోచ్చారణల మధ్య అభిమంత్రించారు. అనంతరం భక్తులు వాటిని శిరస్సున ధరించి అమ్మవారి గర్భాలయానికి చేరుకున్నారు.

అక్కడ ఏర్పాటు చేసిన శ్రీచక్ర రాజము, అమ్మవారి ఉత్సవ మూర్తులు, మూలమూర్తులను కలశాలతో అభిషేకించారు.



కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు



వేషధారణలలో కళాకారులు

ప్రముఖుల ప్రత్యేక పూజలు

వసంత పంచమిని పురస్కరించుకుని ప్రముఖులు సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య, గద్వాల జిల్లా జడ్జి కె.కుషా, వనపర్తి న్యాయాధికారి కమలాపురం కవిత, అలంపూరు న్యాయాధికారి మిథున్ తేజ్‌లు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముందుగా వీరికి ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఈవో పురేందర్ కుమార్ సాదర స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో అభి షేకం, అమ్మవారి ఆలయంలో కలశాభిషేకం చేయించి సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆది దంపతుల కల్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సహస్రఘటాభిషేకం అనంతరం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ధ్వజస్తంభ మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామి, అమ్మవారి కల్యాణం కమనీయంగా సాగింది. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే విజయుడు హాజరు కాగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి మహాయజ్ఞం

- సూర్యదేవుని సన్నిధిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

తాడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్వామి వారికి తెల్లవారుజామున అభిషేకం అనంతరం ఛాయాదేవి, ఉషాదేవి సమేత సూర్య భగవానుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణార్థం విశ్వశాంతి మహాయజ్ఞాన్ని రామధూత ఆశ్రమం ఆమంగల్ శివానంద గిరిస్వామి వారి చేతుల మీదుగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్న దంపతులతో పాటు బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులందరికీ అన్నప్రసాదాలను అందజేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని అట్టహాసంగా పూర్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మంచినీరు అందుబాటులో ఉంచారు. ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో అఖండ భజన నీరాజనాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీతో పాటు గ్రామస్థులు, ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



యజ్ఞంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీదేవి పరమేశ్వర్‌రెడ్డి దంపతులు

కమనీయం కల్యాణోత్సవం

- స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మాఘశుద్ధ పంచమి సందర్భంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. వేదపండితులు కల్యాణ విశిష్టతను తెలియజేస్తూ వేంకటేశ్వరస్వామి తరుపున లక్ష్మీదేవి మెడలో మంగళసూత్ర ధారణ చేశారు. అంతకు ముందు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. కల్యాణం తిలకించడానికి అమడబాకుల ప్రజలతో పాటు సత్యహళ్లి, భూత్కూర్, వడ్డెవాట, రాయణిపేట, ముమ్మళ్లపల్లి, కొత్తకోట గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మార్కెట్, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్లు ప్రశాంత్, గొల్లబాబు, బీసీ పొలిటికల్ రాష్ట్ర చైర్మన్ యుగంధర్‌గౌడ్ లక్ష్మీ వేంకటేశ్వరుని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు కృష్ణయ్య, సుందర్‌రెడ్డి, వామన్ గౌడ్, జనార్దన్‌రెడ్డి, శేషిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేంద్రాచారి, విజయారెడ్డి, రంగారెడ్డి, వెంకటయ్య, రామస్వామి, మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, కొల్లంపల్లి యాదవ్, ప్రకాష్, శంకర్, మన్యం, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేతో కలిసి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మధుసూదన్‌రెడ్డి, చిన్నారెడ్డి

గోవర్ధన్ ముదిరాజ్ ఆశయాలు కొనసాగించాలి

● విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గోవర్ధన్ ముదిరాజ్ ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గోవర్ధన్ ముదిరాజ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన కుమారుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ తన వ్యవసాయ క్షేత్రంలో స్మృతివనం ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన గోవర్ధన్ విగ్రహాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మరణించినా జ్ఞాపకాలు సజీవంగా ఉండేందుకు చక్కటి స్మృతివనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు వినోద్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, మల్లు నర్సింహారెడ్డి, బెక్కరి అనిత, సీజె బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో జిల్లా విద్యార్థికి ద్వితీయ బహుమతి



బహుమతి అందుకుట్ను విద్యార్థిని ఆయిషా ఫాతిమా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అబాకస్ జూనియర్ విభాగం పోటీల్లో జిల్లా కేంద్రంలోని విస్డమ్‌గ్రామర్ స్కూల్ విద్యార్థి ఆయిషా ఫాతిమా రెండవ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, కరస్పాండెంట్ సయ్యద్ ఫసియొద్దీన్, ప్రిన్సిపాల్ రహమత్‌బేగం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆయిషా ఫాతిమా జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం 350 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ఇందులో మా పాఠశాల విద్యార్థికి ద్వితీయ బహుమతి రావడం అభినందనీయమని అన్నారు.

మిషన్ 'మధుమేహ'

(5వ పేజీ తరువాయి..)

మందులు ఇస్తారు. అప్పటికే మందులు వాడుతున్న వారి షుగర్ లెవల్స్ చెక్ చేసి, కంట్రోల్‌లో ఉందా?, కాంప్లికేషన్ ఏమైనా ఉందా?, మెడిసిన్ డోసేజీ పెంచాలా? నిర్ధారించుకుని ఆ ప్రకారంగా సేవలు అందిస్తున్నారు.

3.09 లక్షల మందికి స్క్రీనింగ్..

వనపర్తి జిల్లాలో 30 సంవత్సరాల వయసు పైబడిన వారు 3,09,291 మంది ఉన్నట్లు గుర్తించారు. మొదట గత సంవత్సరం నవంబరు ఒకటి నుంచి డిసెంబరు 15 వరకు అప్పరాల, కడుకుంట్ల, కమాలుద్దీన్‌పూర్, మదనాపూర్, శ్రీరంగాపూర్ పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 72,126 మంది 30 సంవత్సరాల పైబడిన వారిని గుర్తించారు. అందులో మొదటి విడతలో 58,127 మందికి డయాబెటీస్ స్క్రీనింగ్ పూర్తి చేశారు. మొత్తంలో 80.6 శాతం మందికి స్క్రీనింగ్ పూర్తికాగా, 13,999 మంది మాత్రం ఇంకా మిగిలారు. స్క్రీనింగ్ చేసిన వారిలో అప్పటికే మందులు వాడుతున్న వారు 3,099 మందిని గుర్తించగా.. వారికి చెకప్స్ పూర్తి చేసి మందులు ఇస్తున్నారు. 1,662 మందిని డయాబెటీస్ ఆర్‌బీఎస్ 126 మిల్లీ గ్రాములు దాటిన అనుమానితులుగా గుర్తించారు. వారికి సంబంధించిన శాంపిళ్లను టీ హబ్‌కు వ్యాధి నిర్ధారణ కోసం పంపించారు. అందులో 201 మందికి కొత్తగా డయాబెటీస్ ఉన్నట్లు నిర్ధారించి, మెడికేషన్ ప్రారంభించారు. అలాగే అనుమానితులకు తగు సూచనలు చేశారు.

రెండో విడత ప్రారంభం..

మిషన్ మధుమేహాలో భాగంగా మొదటి విడత స్క్రీనింగ్ డిసెంబరులో పూర్తికాగా.. ఇప్పుడు రెండో విడత స్క్రీనింగ్‌ను ప్రారంభించారు. అప్పుడు ఐదు పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం అమలు చేయగా, ఇప్పుడు 11 పీహెచ్‌సీల్లో రెండో విడత సోమవారం నుంచి ప్రారంభమైంది. మొత్తం 113 బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. దాదాపు 110 రోజుల్లో స్క్రీనింగ్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విడతలో మొత్తం 2,33,919 మందికి పరీక్షలు చేయనున్నారు. అయితే చాలామంది ప్రజలు కలెక్టర్, వైద్యారోగ్యశాఖ చేస్తున్న ఈ వినూత్న కార్యక్రమంపై అవగాహన లేక దూరంగా ఉంటున్నారు. దీంతో వ్యాధి నిర్ధారణ చేయడం కూడా కష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వస్తే ఈ కార్యక్రమం విజయవంతం చేయవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచిస్తున్నారు. ఆయన స్వయంగా వెళ్లి పలు గ్రామాల్లో కార్యక్రమ తీరుతెన్నులను పరిశీలిస్తున్నారు. ఎన్‌సీడీ ప్రకారం వనపర్తి జిల్లాలో హైపర్‌టెన్షన్ బాధితులు 40,088 మంది ఉండగా, డయాబెటీస్ బాధితులు 20,599 మంది ఉన్నారు. ఈ స్క్రీనింగ్ తర్వాత ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే అన్ని జిల్లాల్లో ఈ తరహా స్క్రీనింగ్ ఉంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



డయాబెటిక్ స్క్రీనింగ్ కోసం 30 ఏళ్ల పైబడిన ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలి. అప్పుడే మిషన్ మధుమేహం కింద ప్రజారోగ్యం కోసం చేపట్టిన కార్యక్రమం సఫలీకృతమవుతుంది. ఎంత తొందరగా నిర్ధారణ చేసుకుంటే ప్రజల ఆరోగ్యానికి అంత మంచిది. ఈ కార్యక్రమం కొత్తవారిని గుర్తించడంతోపాటు, పాతవారికి సరైన మెడికేషన్ ఫాలోప్ కూడా చేయడం జరుగుతోంది. మొదటి విడతలో 201 మందిని గుర్తించాం. సోమవారం నుంచి రెండో విడత స్క్రీనింగ్ 11 పీహెచ్‌సీల పరిధిలో ప్రారంభించాం.

- డాక్టర్ రాంచందర్‌రావు, ప్రోగ్రాం అధికారి

హైబ్రిడ్ సైకిల్ తయారీలో విద్యార్థి ప్రతిభ

- అభినందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ సైకిల్ తయారీలో విద్యార్థి ఎంతో ప్రతిభ కనబరిచారని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బల్మూరు మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి గగన్ చంద్ర అనే విద్యార్థి హైబ్రిడ్ సైకిల్ తయారీ చేసినందుకు ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాటాడారు. సాధారణ సైకిల్‌కు సౌర విద్యుత్ పలకలు బ్యాటరీ విద్యుత్ సర్దుబాటుకు వైపై మోటారు సెల్‌ఫోన్ డిస్ప్లే జీపీఎస్ అమర్చి ఆశ్చరపరిచారన్నారు. సౌరవిద్యుత్‌తో ఎలాంటి ఖర్చులేకుండా ఒక్కసారిగా 30కిలో మీటర్లు ప్రయాణిస్తుందన్నారు. నల్లమల మారుమూల ప్రాంతం నుంచి మరిన్ని ఆవిష్కరణలో చేయడంలో నల్లమల విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థికి ఉపాధ్యాయులు, తండ్రి సహకారంతో మోటారు సైకిల్ తయారు చేయడం జరిగిందని పాఠశాల బృందాన్ని అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోడేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన ఎజ్జు కుర్మయ్య (50)గత వారం రోజుల కింద విద్యుత్ షాక్‌కు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వారం రోజుల కిందట తమ వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.

గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించామన్నారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపా రు.

విద్యారంగాన్ని పటిష్టం చేయాలి

● పర్యవేక్షణ అధికారులను నియమించాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య

కొల్లాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించే పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. కొల్లాపూర్ డివిజన్ కేంద్రంలో సీనియర్ నాయకులు నారాయణ ఖుర్బాన్ అలీ అధ్యక్షవర్గంగా డివిజన్‌లోని అన్ని మండలాల ఉపాధ్యాయులకు సర్వీసులు, విద్యా విషయక అంశాలపై కొల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అధ్యయన, అవగాహన తరగతులకు జంగయ్య పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతలు బదిలీలు, నియామకాలు జరిగి కొంత వరకు సబ్జెక్టు టీచర్ల కొరత తీరినప్పటికీ ముఖ్య పర్యవేక్షణ అధికారులైన 33 డీఈవో పోస్టులు, 119 డిప్యూటీ ఈవో పోస్టులు, ఎంఈవోల పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని గతంలో ఆగిపోయిన మన ఊరు మన బడి పనులను తక్షణమే చేపట్టి వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా వాడుకలోకి తీసుకురావాలని అన్నారు. సర్వీస్ అంశాలపై ముఖ్య బోధకులుగా పాల్గొని రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్న ప్రభుత్వం ఆశయాన్ని స్వాగతిస్తూనే ఇటీవల గురుకులాల్లో పెంచిన మెస్ చార్జీల వలెనే ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం చార్జీలను నిత్యావసరాలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ శర్మ, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు శంకర్, రాష్ట్ర కుటుంబ సంక్షేమ నిధి బోర్డు ఆఫ్ డైరెక్టర్ చిన్నయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ఉపాధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు లలితా బాయి, జిల్లా కార్యదర్శులు శంకర్, చంద్రశేఖర్, మహేష్ బాబు, లక్ష్మణ్, లింగమయ్య, నాయకులు శంకర్, వేణు మాదవ్ , కురుమయ్య, రాజేష్, మల్లయ్య, గౌస్ పాషా, మహేష్, క్రాంతి, కురుమయ్య, బాల్‌రాం, మోహన్ లాల్, నరసింహ, అన్ని మండలాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులనుద్దేశించి మాట్లాడుతున్న టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య

స్పోర్ట్స్ బాక్స్

స్కేటింగ్‌లో మెరిసిన తెలంగాణ తేజం

» అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



దివితేష్ దీపక్

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో తెలంగాణ చిన్నోడు అదరగొట్టాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన కరణం చంద్రమోహన్‌రావు కవితలకు ఇద్దరు సంతానం. వీరు వృత్తి రీత్యా తిరుపతిలో ఉంటున్నారు. ఏడవ తరగతి చదువుతున్న చిన్న కుమారుడు దివితేష్ దీపక్ (12) డిసెంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. గత నెల 31 నుంచి ఈనెల రెండవ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 400, 1000 మీటర్ల విభాగంలో రజతం, 600 మీటర్ల విభాగంలో కాంస్యం సాధించి, సింగపూర్, ఇండోనేషియా దేశాల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తండ్రి చంద్రమోహన్ తెలిపారు. వీరి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడులు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

» అసోసియేట్ డీన్ డాక్టర్ పుష్పావతి


క్రీడాకారులతో అసోసియేట్ డీన్ పుష్పావతి

బిజినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ పుష్పావతి అన్నారు. స్వామి వివేకానంద సేవా బృందం, మై భారత్, జిల్లా యువజన క్రీడా సర్వీసులు శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే కేంద్ర ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందించారు. కార్యక్రమంలో సేవా బృందం సభ్యులు లక్ష్మి, నరసింహ, అజయ్, డాక్టర్ సత్యనారాయణ, బాలరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో గద్వాలవాసి ప్రతిభ

» అభినందించిన మాస్టర్ శ్రీహరి


రాజ్‌కుమార్‌తో మాస్టర్ శ్రీహరి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జోగుళాంబ గద్వాల జిల్లా వాసి సత్తా చాటారు. గత నెల హైదరాబాద్‌లో నిర్వహించిన 40వ జాతీయ స్థాయి సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని ఎర్రమట్టి వీధికి చెందిన రాజ్‌కుమార్ బంగారు పతకం సాధించినట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, మాస్టర్ శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 24 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో రాజ్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి


కబడ్డీ జిల్లా జట్టుతో శ్రీధర్‌రెడ్డి, కురుమూర్తి గౌడ్, సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం నుంచి ఏడవ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా పురుషుల జట్టు సోమవారం తరలివెళ్లింది. అంతకుముందు మహబూబ్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, సభ్యులు దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలరాజ్, పాపారాయుడు, ఆర్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

» కల్వకుర్తి సీఐ నాగార్జున


జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న సీఐ నాగార్జున

కల్వకుర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడాకారులుగా రాణిస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని కల్వకుర్తి సీఐ నాగార్జున అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను కూడా స్పోర్ట్స్ కోటాలో ఎస్ఐ ఉద్యోగం సాధించినట్లు ఆయన తెలిపారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 250 పైగా క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో 25 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు తెలిపారు. వారు ఈ నెల 22, 23న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర జూనియర్, యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్థానిక తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పరశురాం, అంజయ్య, ఆర్కపల్లి ఆనంద్, కర్రె శ్రీనివాసులు, పోలె జంగయ్య, ఉపాధ్యాయులు, పీఈటీలు ప్రసాద్, బాలయ్య, చంద్రశేఖర్, జగన్, పూర్ణచంద్, శ్రీశైలం, రవికుమార్, జక్కా రాజేందర్, రాజు పాల్గొన్నారు.

క్యాన్సర్ కలవరం



» జిల్లాలో అధికారికంగా 1,406 మంది బాధితులు
» మొదటి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్
» రెండో స్థానంలో రొమ్ము, ఓరల్, తదితరాలు
» చివరి దశలో ఉన్న వారికి పాలియేటివ్ కేర్ సేవలు
» వ్యాధి నివారణపై అవగాహన అవసరం



మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాణాంతక క్యాన్సర్ చాప కింది నీరులా విస్తరిస్తూ కలవరపెడుతోంది. గత ఏడాది అధికారికంగా 1,406 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించారు. అనధికారికంగా మరో మూడు వేల మంది వరకు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అవగాహన లోపం, బయటకు చెప్పుకోలేక బాధితులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో ఓరల్, రొమ్ము క్యాన్సర్ బాధితులున్నారు. చివరి దశలో ఉన్న వారికి జిల్లా కేంద్రంలోని పాలియేటివ్ క్యాన్సర్ కేర్ సెంటర్‌లో సేవలందిస్తున్నారు. జనరల్ ఆసుపత్రిలో ఓపీకి వచ్చిన వారికి ఇతర పరీక్షలు నిర్వహించి, లక్షణాలను గుర్తించి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

చివరి దశలోనే గుర్తింపు

ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో వచ్చే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడంతో చాలా మంది ఈ మహమ్మారి బారిన పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో 1406 మంది వరకు ఈ వ్యాధి భారిన పడ్డారు. వారిలో ఎక్కువగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు 102 మంది ఉన్నారు. రొమ్ము క్యాన్సర్‌తో 65 మంది, నోటి క్యాన్సర్‌తో 87 మంది బాధ పడుతున్నారు. మరో 1,152 మంది వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడిన వారున్నారు. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఎక్కువ మంది బాధితులు వ్యాధి చివరి దశలోనే గుర్తించబడుతున్నారు. అనధికారంగా జిల్లాలో మరో మూడు వేల మందికి పైగా బాధితులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, భయం, నలుగురికి తెలుస్తుందేమోనన్న ఆందోళనతో కొందరు చికిత్సకు ముందుకు రావడం లేదు.

అవగాహన లోపమే ప్రధాన కారణం



అవగాహన లోపంతోనే ఎక్కువ మంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. శరీరంలోని ఏ అవయవానికైనా వచ్చే వ్యాధి ఇదని ప్రజలు గుర్తించడం లేదు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులో పెళ్లిళ్లు, గర్భధారణ తదితర కారణాలతో ఎక్కువ మంది మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే నయం చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. పురుషుల్లో ఎక్కువగా వచ్చే నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం వల్లే వస్తున్నాయి. మద్యం తాగడం, పాన్, గుట్కా, పాన్ మసాలాలు తినడం వల్లే ఎక్కువ మంది ఈ మహమ్మారి బారిన పడుతున్నారు.

– డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి

బాధితులకు ఉచిత సేవలు

క్యాన్సర్ బారిన పడి, చివరి దశలో ఉండి, ఆదరించే వారు లేని, హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకునే స్థోమత లేని వారికి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు63 మంది చికిత్స పొందారు. అదేవిధంగా 497 మంది ఓపీ సేవలు పొందుతున్నారు. మరో 2,116 మందికి మొబైల్ వ్యాన్ ద్వారా ఇంటివద్దే వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రంలో వ్యాధి లక్షణాలను బట్టి డ్రస్సింగ్, పొట్టలో చేరిన నీటిని తీసేయడం, ఫిజియోథెరపీ, ఫ్యామిలీ ట్రైనింగ్ అండ్ కౌన్సెలింగ్ సేవలను ఉచితంగా అందిస్తున్నారు.



మహిళలే అధికం

క్యాన్సర్ బాధితుల్లో ఎక్కువ శాతం మహిళలే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వారిని కబళిస్తోంది. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలోని క్యాన్సర్ సెంటర్‌లో దాదాపు 4,300 మంది మహిళలకు పరీక్షలు చేయగా, వారిలో 280 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షలున్నట్లు గుర్తించారు. బయాప్సీ చేయగా వారిలో 102 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. వారిలో 88 మంది ఎంఎన్‌జే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి 2,100 మందికి పరీక్షలు చేయగా, 65 మందికి నిర్ధారణ అయ్యింది. నోటి క్యాన్సర్ బాధితుల్లో ఎక్కువ మంది పురుషులే ఉన్నారు. మొత్తం 3,200 మందికి పరీక్షలు చేయగా, 87 మందికి ఓరల్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. మిగతా వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్, కడుపులో గడ్డలు ఉన్న బాధితులు ఉన్నారు. ఇది అధికారిక సమాచారం కాగా, లెక్కలోకి రానివారు చాలా ముందే ఉన్నట్లు సమాచారం. కనీసం పరీక్షలు చేయించుకునేందుకు కూడా ముందుకు రాని వారు ఉన్నారని వైద్యులు చెప్తున్నారు.

మా భూమి మాకు కావాలి

» పక్క పొలం వారు కబ్జా చేశారని ఆవేదన » కలెక్టరేట్ ఎదుట కుటుంబం సహా బాధితుల ఆందోళన
» గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం » అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తమ భూమిని కొందరు కబ్జా చేశారని ఆరోపిస్తూ ఓ కుటుంబం సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టింది. బాధితులు వడ్డె పరశురాం, వడ్డె తిమ్మప్ప, వడ్డె కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజ మండలం, యాపలదిన్నె శివారులోని గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె సవరాన్నకు ముగ్గురు కుమారులు వడ్డె పరశురాం, వడ్డె తిమ్మప్ప, వడ్డె కృష్ణ ఉన్నారు. సర్వే నెంబర్ 321లో వీరి తండ్రి వడ్డే సవారన్న పేరున 1986లో ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని ఇచ్చింది. సవారన్న, ఆయన భార్య చనిపోయాక ముగ్గురు అన్నదమ్ములు ఆ భూమిని సాగు చేస్తున్నారు. ఆ భూమి పక్కనే ఉండే పొలం యజమానులు లోకేశ్వర్‌రెడ్డి, చావలి గోవిందమ్మ, సి.సత్యారెడ్డి, చాకలి శంకరన్న, కె.ఎల్లారెడ్డి ఆక్రమించుకున్నారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు, కలెక్టర్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారికి న్యాయం దక్కలేదు. దీంతో గత ఏడాది వారు హైకోర్టును ఆశ్రయించి భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరారు. ఆరు వారాల్లో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కానీ ఫిర్యాదుదారులు మౌఖాలో లేరని సర్వే అధికారులు నివేదిక ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబసభ్యులు రెండు సార్లు కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో వారు సోమవారం మరోసారి కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో కూడా కబ్జాదారుల పేర్లే ఉన్నాయని వారు తెలిపారు. ఈ విషయంపై అడిగితే వారు చంపుతామని బెదిరించినట్లు చెప్పారు. న్యాయం చేయకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని తెలిపారు. దీంతో పోలీసులు వారికి నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

వైభవంగా బండారు మహోత్సవం

» ఊట్కూర్ బీర లింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు » పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం




బండారు మహోత్సవానికి తరలివచ్చిన భక్తులు, పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరులో సోమవారం బీరలింగేశ్వర స్వామి బండారు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి కురువల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద హోమం నిర్వహించారు. ఆ తర్వాత భక్తులు వరుసలుగా కూర్చోగా కుల పెద్దలు, బంధువులు పసుపు చల్లి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం పసుపుమయంగా మారింది. ఈ సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బీరప్ప స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బండారు మహోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం బీరప్ప స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఊట్కూర్ మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అరవింద్‌కుమార్, అశోక్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోవిందప్ప, నాయకుడు ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఖాతాల్లోంచి రూ. 1.15 లక్షలు స్వాహా

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరి బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.15 లక్షలను సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపిన వివరాలు.. పాత పాలమూరుకు చెందిన పాపగల్ల నాగరాజు అనే వ్యక్తి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపించాడు. ఆ లింక్ ఓపెన్ చేయగానే అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.19 వేలు కట్ అయ్యాయి. వెంటనే 1930కి కాల్ చేయగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని సూచించడంతో, అతడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. అలాగే గోల్‌మజీద్‌కు చెందిన మహ్మద్ రవూఫ్ అనే వ్యక్తి మొబైల్ టెలిగ్రాం ఆప్‌కి గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపించాడు. పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వస్తుందని ఉండటంతో దానిని క్లిక్ చేశాడు. వెంటనే అతడి అకౌంట్‌లోనుంచి రూ.86 వేలు మాయం అయ్యాయి. అతడు కూడా వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి కావడం లేదని ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వేపూరిగేరికి చెందిన బోయ శ్రీనివాసులు (39)కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మోనప్ప గుట్ట సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

రాజస్థాన్ యువకుడి హత్య

నారాయణపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బతుకుదెరువు కోసం నారాయణపేట జిల్లాకు వచ్చిన ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు, బావమరిది శివరాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రం, భరత్‌పూర్ జిల్లా, బయాన తాలుకా, శీతల్పుర గ్రామానికి చెందిన విక్రమ్ సింగ్ (40) బావమరిది శివరాజ్, మరొకరితో కలిసి నాలుగేళ్ల క్రితం నారాయణపేటకు వలస వచ్చారు. ఇళ్లకు టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున బస్టాండ్ దగ్గరున్న విక్రమ్ సింగ్‌ను మాదం బాలరాజు, చింత గోపి, దాసరిరాజు, గుర్మింటికల్ నరేశ్, ఎండీ రఫీ అనే వ్యక్తులు క్రీడా మైదానానికి తీసుకెళ్లి కొట్టి చంపారు. ఈ మేరకు బావమరిది శివరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

తండ్రి, తమ్ముడిపై సోదరుల దాడి

వెల్దండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో తండ్రితో సహా తమ్ముడిపై సోదరులు దాడి చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం, ఎంజీ కాలనీ తండాకు చెందిన రాత్లావత్ నరేశ్, అతడి సోదరుడు శ్రీనుకు నడుమ కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం వెల్దండలో ఇరువర్గాలు కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో తండ్రి రాంచందర్, తమ్ముడు నరేశ్‌లపై అన్న శ్రీను, అతడి భార్య సోని, మరో అన్న రమేశ్ దాడి రమేశ్ దాడి చేశారు. ఈ మేరకు నరేశ్ ఫిర్యాదు చేయడంతో, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ శివారులో కురుమూర్తి జాతర మైదానం సమీపంలోని వెంచర్ సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె వయసు దాదాపు 40 ఏళ్లు ఉండొచ్చని పేర్కొన్నారు. ఆనవాళ్లు తెలిపిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

» తాగుడు మానేయమన్నందుకు కుమారుడే చంపినట్లు అనుమానం » పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త


యాదమ్మ (ఫైల్)

బిజినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మహదేవునిపేట గ్రామానికి చెందిన లేట్ల యాదమ్మ(55)కు భర్త ఉత్తయ్య, ఇద్దరు కుమారులు కరుణాకర్, పరమేశ్ ఉన్నారు. చిన్న కుమారుడు పరమేశ్ హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కుమారుడు కరుణాకర్ తాగుడుకు బానిసగా మారి గ్రామంలోనే తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ప్రతీరోజు తాగివచ్చి తల్లితో గొడవ పడుతుండేవాడు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి ఆమె ఇంటి చుట్టుపక్కల ఉన్న గ్రామస్థులకు తీవ్ర దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి చూడగా సమీపంలోని పొదల్లో యాదమ్మ శవం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. తాగుడు మానేసి పని చేసుకోవాలని నిత్యం చెబుతుండటం రుచించని కరుణాకర్, రెండు రోజుల క్రితం తల్లిని చంపి, ఇంటి పక్కన ఉన్న చెట్ల పొదల్లో వేసి ఉంటాడని అనుమానం వ్యక్తం అవుతోంది. కొడుకుపైనే అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా శివస్వాముల పడి పూజ

దేవరకద్ర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయంలో శివ స్వాములు పడిపూజను వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ చేశారు. ఆ ప్రాంతమంతా శివనామస్మరణతో మార్మోగింది.

కందులు క్వింటాలుకు రూ.7,051

దేవరకద్ర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మార్కెట్‌కు సోమవారం కందులు క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,051 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. మొత్తం 60 క్వింటాళ్ల విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,051, కనిష్ఠంగా రూ.6,609 పలికింది.

ఎంపీటీసీ స్థానాల తుది జాబితా విడుదల

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపీటీసీ స్థానాల తుది జాబితాను సోమవారం ఎంపీడీవో జయరాం విడుదల చేశారు. గతంలో 19 స్థానాలు ఉండగా, నాలుగు స్థానాలు వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలంలో కలిశాయి. కొల్లూరు, పోమాల్, కామారం, చౌడూరు, గురుకుంట, నవాబ్‌పేట, కొండాపూర్, యన్మన్‌గండ్ల, కాకర్లపహడ్, తీగలపల్లి, కారుకొండ, కూచూరు, ఇప్పటూరు, లోకిరేవు, కిషన్‌గూడను ఎంపీటీసీ స్థానాలుగా ఎంపికైనట్లు ఎంపీడీవో తెలిపారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కమిటీ ఎన్నిక

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, శశిధర్‌నాయక్ సోమవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా నాన్యానాయక్, గౌరవ అధ్యక్షుడిగా రతన్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా రవీందర్, మహిళా అధ్యక్షురాలిగా స్వప్న, లత, ఉపాధ్యక్షులుగా శ్రీను, వీణ, కార్యదర్శిగా దీపిక, ఎలక్షన్ మెంబర్‌గా స్వప్న, గౌరవ సలహాదారులుగా నాగ్యానాయక్, దశరథ్ నాయక్ ఎన్నికయ్యారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బోనస్ అందించాలి

గండీడ్ , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన సన్న వడ్ల బోనస్ రూ.500 అందలేదని సోమవారం మండలంలోని గండీడ్, జంగంరెడ్డిపల్లి, అంచన్‌పల్లి, కొంరెడ్డిపల్లి గ్రామాల రైతులు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీను, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించండి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ పది, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించి పరీక్షల ఫీజు గడవును ఈ నెల 13 లోపు తత్కాల్ ద్వారా చెల్లించుకునే అవకాశం కల్పించినట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పది ఇంటర్ చదివే అభ్యర్థులు ఈనెల 10 లోపు రూ.50 అపరాధ రుసుముతో చెల్లించాలని, 13 వరకు తత్కాల్‌లో చెల్లించే అవకాశం ఉందన్నారు. పదో తరగతికి ప్రతీ సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలని, ఇంటర్మీడియట్‌కు ప్రతీ సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జడ్చర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి పత్తి మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ సహకారంతో బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం చైర్మన్ సుదర్శన్‌గౌడ్ సోమవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు కందుల కొనుగోలు కేంద్రంలో విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550 పొందాలన్నారు. బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, మునిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్ జ్యోతి పాల్గొన్నారు.

ఆరోపణలు తగవు

మిడ్జిల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పల్లె టౌన్‌షిప్ ఏర్పాటుపై తనపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి తెలిపారు. ఇదే విషయంపై సోమవారం ఎంపీడీవో గీతాంజాలి, పంచాయతీ కార్యదర్శి సాయన్నకు పల్లె టౌన్‌షిప్‌కు సంబంధించిన పత్రాలను చూయించడం జరిగిందన్నారు. తమకు సంబంధించిన భూమి సర్వే నెంబర్ 36లో తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయశాఖ, మహిళా సమైఖ్య కార్యాలయాల ప్రహారి నిర్మాణం కోసం 16 గుంటల భూమిని ఇవ్వడం జరిగిందన్నారు. తమకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం ఇస్తామని, తమ భాగస్తులందరికీ సర్వే నెంబర్ 10లో ఐదు గుంటల భూమిని ఇస్తామని అప్పటి మంత్రి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చి, నేటికీ తనకు ఇవ్వలేదన్నారు. కొందరు పాత్రికేయులు తనపై తప్పుడు వార్తలు రాస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేపీ మండల మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్ ఉన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం

» కలెక్టర్ విజయేందిర బోయి

» 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో కృషి చేసి నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక సంవత్సరం పిల్లలు మొదలుకొని 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఆ రోజు మాత్రలు ఇవ్వని వారికి తిరిగి ఫిబ్రవరి 17న ఇవ్వాలని ఆదేశించారు. ఈ మాత్రలతో పిల్లల్లో నులి పురుగుల సమస్య, రక్తహీనత, బుద్ధి మాంద్యం, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. ఈ విషయంపై గ్రామాల్లో టాం టాం వేయించాలని డీపీవోను ఆదేశించారు. డీఎంహెచ్‌వో కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు 2,59,292 మంది ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, డీఈవో ప్రవీణ్‌కుమార్, మహిళ, శిశుసంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, డీపీఓ పార్థ సారధి, డీఆర్డీవో నర్సింహులు, వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారిణి ముంజుల పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ప్రతీ సోమవారం వస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణికి 63 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జడ్పీసీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీఏ నర్సింహులు, ఆర్డీవో నవీన్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి





సరస్వతీ ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/మహ్మదాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సరస్వతీమాత ఆలయాల్లో సోమవారం వసంత పంచమి పురస్కరించుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఏనుగొండలోని సరస్వతీ మాత ఆలయంలో చిన్నారులకు సాయూహిక అక్షరాభ్యాసం కనుల పండువగా నిర్వహించారు. ఎస్వీఎస్ మెడికల్ కళాశాల విద్యార్థినులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర కాలనీలోని హయగ్రీవ స్వామి ఆలయంలో చిన్నారులకు అర్చకులు వంశీకృష్ణ, సంతోష్‌కుమార్ అక్షరాభ్యాసం నిర్వహించారు. ఏనుగండ జ్ఞాన సరస్వతీ ఆలయంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వినీత శ్రీరామ్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, విష్ణు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. మహ్మదాబాద్ మండలం నంచర్ల చైతన్య పాఠశాలలో సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 56 జంటలతో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మహ్మదాబాద్, గండీడ్ మండలాధ్యక్షులు కెఎం నారాయణ, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. జడ్చర్ల పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో 50 మంది చిన్నారులకు కృష్ణానంద స్వాముల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు ఆర్య సమాజం ఆధ్వర్యంలో సరస్వతి మాత యజ్ఞం జరిపించారు. పద్మలీల, నోముల కృష్ణయ్య, శశికళ, సుధాకర్, ప్రధానాచార్యులు వెంకటయ్య పాల్గొన్నారు.

అక్షర పాఠశాలలో..



అక్షర పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : జిల్లా కేంద్రంలోని అక్షర పాఠశాలలో నిర్వహించిన వసంత పంచమి వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని, సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం చిన్నారుల అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రమా మొగులప్ప, ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు. అదే విధంగా జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సరస్వతీ దేవి అమ్మవారికి కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ పూజలు నిర్వహించారు. అకాడమిక్ డైరెక్టర్ జీవన్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి చిన్నతేరు



పుష్పరథంలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

జడ్చర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారికి మనోహరమైన రెండు సేవలతో పాటు స్వామి వారికి పుష్పరథము (చిన్నతేరు)ను ఘనంగా నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా స్వామి వారికి మనోహరమైన రెండు సేవలలో శేష వాహన సేవ, హంసవాహన సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి 10 గంటలకు స్వామి వారికి పుష్పరథము (చిన్నతేరు) కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్పరథము సందర్భంగా స్వామి వారి, అమ్మవారి విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దీప్తిరెడ్డి, అనువంశిక ధర్మకర్త గోకుల్, ఆలయ ట్రస్టీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారులను నియమిస్తాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం క్లస్టర్ల వారిగా రిటర్నింగ్ అధికారులను నియమిస్తామని డీపీవో పార్థసారథి అన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్ వీసీలో ఆదేశించిన వివరాలను వెల్లడించారు. పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం రెండు విడతల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తుందని, అందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారని తెలిపారు. క్లస్టర్‌కు ఒక ఆర్వో చొప్పున జిల్లాకు 72 మంది ఆర్వోలు అవసరమవుతారని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

రాజాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : దొండ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిచోండ్ అభిమన్యురెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని సింగమ్మగూడ గ్రామ పంచాయతీ దంజ్యతండాకు చెందిన బాల్యానాయక్ కూతురు గంగోత్రి వివాహానికి, మండల కేంద్రానికి చెందిన హన్మగళ్ల జంగయ్య కూతురు మమత వివాహానికి రూ.10 వేలు, రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు.

నాగ పడగ వితరణ

మూసాపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం బలీదుపల్లి శివరామ ఆంజనేయస్వామి ఆలయంలో శివుడికి గ్రామానికి చెందిన కొమ్ముల కృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేష్‌సాగర్ సోమవారం నాగ పడిగను అందజేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి తారాకేశ్వర్‌స్వామి, కోట్ల ప్రతాప్‌రెడ్డి, డీలర్ జగదీశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్, విష్ణుస్వామి, సహదేవ్‌యాదవ్ స్వామి, అశోక్ సాగర్ ఉన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ షెటర్లకు టెండరు దరఖాస్తులు

మహమ్మదాబాద్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ 24 షెటర్లకు టెండర్ ద్వారా ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల కాంప్లెక్స్ రీ టెండరింగ్ కమిటీ చైర్మన్ తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో కమిటీ సమావేశం నిర్వహించి ప్రతీ దరఖాస్తుదారుడు రూ.ఐదు వేలు చెల్లించాలన్నారు. ఈ నెల 11 వేలం పాట ఉంటుందని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎంఈవో రాజు నాయక్, ఎంపీడీవో, ఎస్ఐ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

మూసాపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోల్కంపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి గడ్డివాము దగ్ధమైంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన పిచ్చకుంట్ల నర్సింహులు అనే రైతుకు పోల్కంపల్లిలో పొలం ఉండటంతో అక్కడే గడ్డివాము ఏర్పాటు చేశాడు. గడ్డివాముకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఆకస్మికంగా జంపర్ కాలిపోయి నిప్పురవ్వలు గడ్డివాములో పడటంతో మంటలు వ్యాపించి గడ్డివాము కాలిపోయింది. దీంతో రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఘనంగా లక్ష్మారెడ్డి జన్మదినం



రక్తదానం చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తనయుడు స్వరణ్

జడ్చర్ల/రాజాపూర్/మిడ్జిల్/నవాబ్‌పేట/బాలానగర్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ, సీఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా, 1071 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. జిల్లా జనరల్ ఆసుపత్రి, పాలమూరు బ్లడ్ బ్యాంక్, ఎస్వీఎస్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో 1071 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. రక్తదానం చేసిన దాతలను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తనయుడు స్వరణ్ అభినందించారు. అంతకుముందు కావేరమ్మపేట సమీపంలోని ఎంబీ మెడికల్ సెంటర్ నుంచి ప్రేమ్‌రంగా గార్డెన్స్ వరకు కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి, కేకును కట్ చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి, కేక్ కట్ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, జడ్పీటీసీ మాజీ మోహన్‌నాయక్ పాల్గొన్నారు. మిడ్జిల్ మండల బైక్‌ర్యాలీ నిర్వహించి, కేక్ కట్ చేశారు. మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జడ్పీటీసీలు హైమావతి బాల్‌రెడ్డి, శశిరేఖ బాలు పాల్గొనగా, నవాబుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మాడేమోని నర్సింహులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు. బాలానగర్ మండలం పెద్దాయపల్లి చౌరాస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీగా జడ్చర్లకు తరలివెళ్లారు.

అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 11న అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ డీఎం సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు ఫిబ్రవరి 10న రాత్రి ఏడు గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనం, వెల్లూర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం ఫిబ్రవరి 11న సాయంత్రం ఆరు గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ అనంతరం ఫిబ్రవరి 12న మధ్యాహ్నాం రెండు గంటలకు తిరిగి బయలుదేరి ఫిబ్రవరి 13 ఉదయం మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ టూర్ ప్యాకేజీ ఒక్కొక్కరికీ రూ.3,600 సంస్థ నిర్ణయించిందన్నారు. టీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చునని, పూర్తి సమాచారం కోసం 9959226286, 738287102 సంప్రదించాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాదిగలు

పాలమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాదిగల రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ ప్రత్యేక అసెంబ్లీలో చర్చిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో మాదిగ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డమీది గోపాల్, వర్కింగ్ ప్రసిడెంట్ మెట్ట యాదయ్య, కార్యదర్శి దండు దేవన్న, కొత్తపల్లి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు బొర్రా సురేష్, రాజారాం, మొగిలన్న, అరుణ్‌కుమార్, విజయకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే మంచి పేరు తేవాలి

» ఫిజియోథెరపీ కళాశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో ఉన్న ఫిజియోథెరపీ కళాశాలకు రాష్ట్రంలోనే మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి వెనకాల ఉన్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ఫిజియోథెరపీ నూతన కళాశాల భవనం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ సంస్థ సేవలు ఒక యజ్ఞంలా కొనసాగుతున్నాయన్నారు. ఆంధ్ర మహిళా సభ దేశవ్యాప్తంగా 33 విద్యా సంస్థలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి మహిళా అభివృద్ధికి దోహదం చేస్తోందని, క్రమ శిక్షణకు మారుపేరుగా రాష్ట్రంలోనే పేరుగాంచిందన్నారు. మాజీ చీఫ్ సెక్రటరీ ఐవీ సుబ్బారావు, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ కార్తీక్, హైదరాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ ఛాయనందిని పాల్గొన్నారు.

నేటిలోగా ఆపార్ వివరాలు నమోదు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను మంగళవారం సాయంత్రంలోపు ఆపార్ లో అప్‌లోడ్ చేయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ ఎంఈవో, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ మండల విద్యాశాఖ కార్యాయంలో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. విద్యార్థుల భవిష్యతును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అన్నింటికి ఆధారం ఆపార్ కాబట్టి అన్ని వివరాలు అప్ లోడ్ చేయాలన్నారు. ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, సీఆర్పీలు శ్రీనివాసులు, వరలక్ష్మి, మొగులయ్య, గీతారాణి, కైసర్ జేబిన్, ఎంఐఎస్ అనిత పాల్గొన్నారు.

లక్షల డప్పులు, వేల గొంతులు సభకు తరలిరావాలి

మిడ్జిల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష డప్పులు వేల గొంతుల ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగాళ్ల సురేష్‌మాదిగ కోరారు. సోమవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు టైగర్ జంగయ్యమాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు గడ్డల విజయ్‌కుమార్ కలిసి విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివ, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు బుచ్చయ్య, నాయకులు బాలయ్య, వెంకటయ్య, దేవయ్య, గణేష్, వంశీ, రవీంద్ర, రవి, మల్లేష్, దానయ్య, కృష్ణయ్య, యాదయ్య, శ్రీకాంత్, నరేష్ ఉన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

పాలమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇంటి జాగాతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు దేశవ్యాప్త నిరసనలు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కురుమూర్తి

పాలమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఇందుకు నిరసనగా.. బుధవారం దేశవ్యాప్త నిరసనలు చేపట్టేందుకు జాతీయ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, కర్షక, వ్యవసాయ సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు మాట్లాడుతూ భారీ నిరసనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎన్‌టీయూసీ నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, పి.సురేష్, సి.వెంకటేష్, రాజు, సాంబశివుడు, అల్వాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో శివుడు, చంద్రకాంత్, బాబుమియా, భగవంతు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా మద్దతు తెలపాలి

బాలానగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌పై కుట్రతో అంతం చేయాలని కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా గిరిజన సమాజం ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా మద్దతు ప్రకటించి సంఘీబావం తెలియజేయాలని బీజేపీ ఎస్టీ సెల్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాయపల్లి చౌరస్తాలోని ఆయన గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో రియల్ వ్యాపారంలో భాగస్వాములుగా పనిచేసిన మహేందర్, జములప్ప అనే వ్యక్తులు శ్రీనివాస్‌నాయక్ కారు డ్రైవర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. ఈ కుట్రలపై పోలీసుకు ఫిర్యాదు చేయడం జరిగిందని, వెంటనే భద్రత కల్పించాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి స్కాముల మీదే ధ్యాస



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వానికి స్కాముల మీద ఉన్న ధ్యాస ప్రజా సంక్షేమంపై ఏ మాత్రం ఉండదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతితో కలిసి మాట్లడారు. దేశ వృద్ధి రేటు బాగుపడిందంటే మోదీ కృషి వల్లే అన్నారు. నాయకులు అంజి, ఎల్లయ్య, మల్లేష్, యాదయ్య, శ్రీను నాయక్, నవీన్, అరవింద్ ఉన్నారు.

ఆర్టిజన్ల ఉద్యమ బాట

పాలమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తమను కన్వర్షన్ చేయాలని ఆర్టిజన్లు సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ నుంచి యాత్ర ప్రారంభించారు. విద్యుత్ శాఖలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లు మూకుమ్మడి పోరుకు సిద్ధమయ్యారు. ఏళ్ల తరబడి ఒకే సంస్థలో పనిచేసే వారికి రెండు రకాల సర్వీస్ రూల్స్ ఉండటం సరికాదన్నారు. విద్యార్హతను బట్టి పదోన్నతి కల్పించాలన్నారు. సబ్‌స్టేషన్ల సంఖ్య పెంచుతున్నా ఉద్యోగుల సంఖ్య పెంచకపోవటం సరికాదన్నారు. 13వ తేదీ వరకు రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో కన్వర్షన్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, కన్వీనర్ వాజీర్, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్, శ్రీనివాసచారి, ప్రభాకర్, అశోక్, బి.అశోక్, యాదయ్య, మల్లేష్, పి.రాఘవేందర్, మోహన్, కె.మోహన్‌నాయక్, భరత్‌కుమార్, సతీష్, నాగేందర్, రవికుమార్, శ్రీకాంత్, వినోద్‌కుమార్, వై.విజయ్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.